క్లుప్తంగా

అబ్దుల్ కలాంకు ఘన నివాళి



కలాం చిత్రపటం వద్ద విద్యార్థులతో కలిసి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

సబ్బవరం: సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాజీ రాష్ట్రపతి, అణు శాస్త్రవేత్త డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతిని నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బి.శంకర్ అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలాం జాతికి చేసిన సేవలను వివరించారు. అణు శాస్త్రవేత్తగా ఆయన సాధించిన విజయాలను కొనియాడారు. కార్యక్రమంలో ఆయనతో పాటు పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కృష్ణుడి ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళం అందిస్తున్న శ్రీనివాసరావు

పరవాడ: మండలంలోని నాయుడుపాలెం శివారు గొల్లపేటలో నూతనంగా ఏర్పాటు చేయనున్న శ్రీకృష్ణాలయం నిర్మాణానికి పరవాడ ఎంపీపీ పైల వెంకట పద్మలక్ష్మి శ్రీనివాసరావు రూ.10 వేల విరాళాన్ని ఆలయ నిర్వాహకులకు గురువారం అందించారు. ఈ కార్యక్రమంలో నాయుడుపాలెం సర్పంచ్ కూండ్రపు వరలక్ష్మి సీతారామయ్య, గ్రామ పెద్దలు బండారు శ్రీను, సారిపల్లి సోమునాయుడు, ఆశోక్, ఉప్పుల నరసింగరావు, నరేష్, అప్పలరాజు పాల్గొన్నారు.

పీఎంకేఎస్‌కేలతో రైతులకు మేలు



పీఎం కిసాన్ సమృద్ధి కేంద్రం ప్రారంభోత్సవంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

పరవాడ: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి కిసాన్ సమృద్ధి కేంద్రా(పీఎంకేఎస్‌కే)లను రైతులు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి పట్టాభి ప్రసాద్ కోరారు. పరవాడలో పీఎంకేఎస్‌కేను గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ చేసిన ప్రసంగాన్ని కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రైతులకు వినిపించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ముత్యాల అప్పారావు, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు చిలుకు నాయుడు, మండల యువమోర్చా అధ్యక్షుడు మోస రామకృష్ణ, వెన్నల నూకరాజు, పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కాలువల్లో పూడిక తొలగింపు



పోలీస్ స్టేషన్ సమీపంలోని కాలువలో జేసీబీతో మట్టి తొలగింపు

సబ్బవరం: మండల కేంద్రంలో పలు ప్రాంతాలు నీటి ముంపునకు గురికావడంతో పంచాయతీ సిబ్బంది తక్షణ చర్యలు చేపట్టారు. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు పోలీస్ స్టేషన్, సబ్బవరం శివాలయం ప్రాంతాలు నీట మునిగాయి. దీంతో వీటిని ఆనుకుని ఉన్న జాతీయ రహదారి కూడా ముంపునకు గురికావడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సాయి నగర్ కాలనీ నుంచి వరద నీరు ప్రధాన రహదారిపై ప్రవహిస్తూ పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతాలను ముంచెత్తింది. దీంతో సబ్బవరం పంచాయతీ అధికారులు ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న కాలువల్లో పేరుకుపోయిన పూడికను గురువారం జేసీబీ సాయంతో తొలగించారు. పంచాయతీ కార్యదర్శి మూర్తి బాబు, నాయకులు కొల్లి కృష్ణ, కొల్లి గంగునాయుడు పూడిక తొలగింపు పనుల్ని పర్యవేక్షించారు.

సబ్బవరం పీహెచ్‌సీకి మహర్దశ



సబ్బవరం పీహెచ్‌సీలో అదనపు బ్లాక్ నిర్మాణానికి స్థల పరిశీలన చేస్తున్న ఎమ్మెల్యే అదీప్ రాజ్



సబ్బవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

- రూ.1.50 కోట్లతో ఆస్పత్రి ఆధునికీకరణ
- వచ్చే నెల 2న అదనపు బ్లాక్ నిర్మాణానికి శ్రీకారం
- త్వరితగతిన నిర్మాణ పనులు–ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సబ్బవరం: విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పెద్దపీట వేస్తున్నారని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ తెలియజేశారు. సబ్బవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ గురువారం సందర్శించారు. ఆస్పత్రిలో అదనపు బ్లాక్ నిర్మాణానికి స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు రూ.కోటీ 50 లక్షలతో ఆస్పత్రి ఆధునికీకరణతో పాటు అదనపు బ్లాక్ నిర్మాణం చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే నాడు–నేడు కార్యక్రమం ద్వారా సుమారు రూ.80 లక్షలతో ఆస్పత్రి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశామన్నారు. అప్పుడు టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ వ్యక్తిగత సమస్యల వల్ల పనులు చేపట్టలేకపోయారని, దీనిపై మరో 5 శాతం అదనంగా కలిపి మళ్లీ టెండర్లు పిలిచి, ఆస్పత్రిని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఈ నిధులకు అదనంగా పార్టీ ప్రజా ప్రతినిధులు మరో రూ.20 లక్షలు జమచేసి అభివృద్ధి చేసేందుకు నిర్ణయించినట్లు పేర్కొన్నారు.

అభివృద్ధి పనుల్లో భాగంగా పీహెచ్‌సీలో కరోనా వంటి విపత్కర పరిస్థితులు ఎదురైనప్పుడు ఐసోలేషన్ సెంటర్‌లాంటి అదనపు బ్లాక్ నిర్మాణానికి మరో రూ.50 లక్షలు మంజూరు చేసినట్టు తెలిపారు. దీని కోసం ఇప్పటికే స్థల పరిశీలన పూర్తయిందని, వచ్చే నెల 2న అదనపు బ్లాక్ నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట పార్టీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు కొటాన రాము, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్ రాజ్, మండల జేసీఎస్ కన్వీనర్ ముత్యాల నాయుడు, పార్టీ మండల కన్వీనర్ కర్రి బాబు, పార్టీ సీనియర్ నాయకులు బోకం రాము నాయుడు, వనం అచ్చంనాయుడు, పీఏసీఎస్ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు కాపుశెట్టి శేషుబాబు, పల్ల కృష్ణ, సబ్బవరం ఉప సర్పంచ్ మండల లక్ష్మణ, నాయకులు మోపాడ అప్పారావు, బోను గంగు నాయుడు, దెడ్డం పద్మావతి, శేఖర్, గొర్లి నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికీ సంక్షేమం



తానాంలో మహిళలకు సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పరవాడ: ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాలు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. మండలంలోని తానాం గ్రామంలో రెండో రోజు గురువారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఆయనకు ప్రజల నుంచి విశేష ఆదరణ లభించింది. అడుగడుగునా మహిళలు మంగళ హారతులు పట్టారు. కార్యక్రమంలో భాగంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని గణాంకాలతో సహా వివరించారు. అర్హతలుండీ సాంకేతిక కారణాల వల్ల సంక్షేమ లబ్ధి పొందలేని వారుంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. స్థానిక సమస్యలపై ఆరా తీశారు. ప్రతి సమస్య పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేస్తామని భరోసానిచ్చారు. త్వరితగతిన చేపట్టాల్సిన పనులపై అధికారులకు అక్కడికక్కడే ఆదేశాలిచ్చారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ ప్రభుత్వంలో అర్హులైన వారందరికీ ఎలాంటి పైరవీలతో పని లేకుండా అన్ని పథకాలు అందిస్తున్నట్టు పేర్కొన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీ సిఫార్సుల కోసం పడిన పాట్లు ప్రజలు ఎవరూ మర్చిపోలేదన్నారు. అప్పట్లో ప్రతి పనికీ ముడుపులు చెల్లించాల్సి వస్తే, జగనన్న ప్రభుత్వంలో పైసా రుసుము లేకుండా ప్రభుత్వ పథకాలు, వివిధ ధ్రువపత్రాలు ఇంటికే వచ్చి అందిస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తూ, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న తమ ప్రభుత్వానికి ప్రజలంతా అండగా నిలవాలని అభ్యర్థించారు. రానున్న ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. దత్తపుత్రుడు, పచ్చపత్రికల దుష్ప్రచారాన్ని ప్రజలంతా గమనిస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో వారికి భంగపాటు తప్పదని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పరవాడ జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు, రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ బంధం నాగేశ్వరరావు, ఎంపీడీవో వి.హేమసుందరరావు, ఈవోఆర్డీ పద్మజ, మండల జేసీఎస్ కన్వీనర్ వెన్నల సన్యాసిరావు, పెందుర్తి మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు పైల అప్పలనాయుడు, ఎంపీటీసీలు గొల్లవిల్లి శ్రీనివాసరావు, అరిజిల్లి దేవీరవి, సర్పంచులు, వివిధ ప్రభుత్వ విభాగాల అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

సమగ్ర భూ సర్వేపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కనకరాజు

సింహాచలం : వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం ద్వారా అందరికీ మేలు జరుగుతుందని వైఎస్సార్‌సీపీ పెందుర్తి మండల అధ్యక్షుడు, జేసీఎస్ కన్వీనర్ నక్క కనకరాజు తెలిపారు. మండలంలోని గుర్రంపాలెం సచివాలయంలో గురువారం భూరక్ష పథకంపై అవగాహన కల్పించారు. స్వతంత్ర భారతావని ఆవిర్భవించాక రాష్ట్రంలో తొలిసారిగా సమగ్ర భూసర్వే జరుగుతోందన్నారు. గ్రామ కంఠం భూములను కూడా సర్వే చేసి ప్రజలకు పూర్తి హక్కు కల్పించడానికి ఈ భూరక్ష ఎంతగానో ఉపయోగపడుతుందని వెల్లడించారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది రైతులకు ఈ పథకంపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో పెందుర్తి ఈవోపీఆర్‌డీ అప్పారావు, గ్రామకార్యదర్శి నాగప్రభు, ఎంపీటీసీ ముదపాక శివ, పార్టీ నాయకులు సారిపల్లి గణేష్, సతీష్, నర్సిబాబు, వార్డు మెంబర్ దేముడు తదితరులు పాల్గొన్నారు.

రామసేతు పునర్నిర్మాణానికి సైకిల్ యాత్ర



సైకిల్ యాత్ర చేస్తున్న గుజరాత్ వాసి చోహాన్

సింహాచలం : రామసేతును పునర్నిర్మించాలని కోరుతూ గుజరాత్‌కి చెందిన చోహాన్ అనే భక్తుడు చేపట్టిన సైకిల్ యాత్ర గురువారం సింహాచలానికి చేరుకుంది. దేశంలోని పలు పుణ్యక్షేత్రాలను సైకిల్‌పై తిరుగుతూ సింహాచలం తొలి పావంచా వద్ద శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్నాడు. విశ్వహిందూ పరిషత్ నాయకుడు పూడిపెద్ది శర్మ తదితరులు అతనికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా చోహాన్ మాట్లాడుతూ సైక్లోన్ ఎఫెక్ట్‌తో కూలిపోయిన రామసేతుని తిరిగి నిర్మించేందు ప్రభుత్వంలో చలనం వచ్చేలా ప్రజల్లో చైతన్యానికి ఈ భారతదేశ యాత్రని చేపట్టానన్నారు. 124 రోజుల క్రితం గుజరాత్ నుంచి యాత్రని ప్రారంభించినట్టు తెలిపారు. ఇప్పటికి ఐదు వేల కిలోమీటర్లకు పైగా ప్రయాణించినట్టున్న పేర్కొన్నారు. ఈ యాత్రలో పలు జ్యోతిర్లింగాలను, పుణ్యక్షేత్రాలను సందర్శించినట్టు వెల్లడించారు.

స్టీల్ ప్లాంట్ మార్కెటింగ్ సీజీఎంకు సత్కారం



మార్కెటింగ్ సీజీఎం సత్యానందంను సత్కరిస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ మార్కెటింగ్ విభాగం చీఫ్ జనరల్ మేనేజర్ (సీజీఎం) ఎం.సత్యానందంను గురువారం ఘనంగా సత్కరించారు. సత్యానందం ఈ నెలాఖరున పదవీ విరమణ చేస్తున్న సందర్భంగా యుటిలిటీస్ విభాగం కాన్ఫరెన్స్ హాల్లో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఉద్యోగులు, యూనియన్ నాయకులు ఆయనకు సన్మానం చేశారు. స్టీల్‌ప్లాంట్ కోసం అంకితభావంతో పనిచేసి కనిష్ట స్థాయి నుంచి అంచెలంచెలుగా చీఫ్ జనరల్ మేనేజర్ స్థాయికి ఎదిగారని వక్తలు కొనియాడారు. సన్మానగ్రహీత సత్యానందం మాట్లాడుతూ అధికారులు, సహోద్యోగులు అందించిన సహకారం మరువరానిదన్నారు. కార్యక్రమంలో యుటిలిటీస్ విభాగాధిపతి ఎస్.ఆర్.రవి, జీఎం శ్యాంబాబు, ఐఎన్‌టీయూసీ నాయకులు నీరుకొండ రామచంద్రరావు, సీహెచ్. సుదర్శనం, బి. రామారావు, వరహాల బాబు, కాశీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఏకాదశి ఆర్జిత సేవలు



స్వర్ణ పుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు, అధికారులు, భక్తులు



గరుడసేవను నిర్వహిస్తున్న అర్చకులు



నిత్యకల్యాణంలో తలంబ్రాల ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

- ఘనంగా స్వర్ణతులసీ దళార్చన

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ బేడా మండపంలో వేదికపై అధిష్ఠింపజేశారు. ఉభయదాతలను వెంటబెట్టుకుని స్వర్ణ పుష్పాలతో ప్రదక్షిణ చేయించారు. స్వామి సన్నిధిలో విష్వక్సేణ పూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. అష్టోత్తర శతనామావళి పూజలో 108 స్వర్ణ పుష్పాలతో అర్చన చేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదాన్ని అందించారు. ప్రధాన అర్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, అర్చకుడు చక్రవర్తి తదితరులు ఈ పూజలను నిర్వహించారు.

విశేషంగా నిత్య కల్యాణం

సింహాద్రినాథునికి గురువారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఉదయం 9.30 గంటల నుంచి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ బేడామండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేసి, విష్వక్సేణపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని అత్యంత వైభవంగా జరిపారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదాన్ని, శేషవస్త్రాలను అందించారు.

వైభవంగా గరుడసేవ

సింహాచలేశునికి గురువారం గరుడసేవ వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని గరుడ వాహనంపై అధిష్ఠింపజేశారు. అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. విశేషంగా హారతులు అందించారు. భక్తులతో గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

30న జిల్లా స్థాయి బాడీబిల్డింగ్ పోటీలు



బాడీబిల్డర్‌కు ట్రాక్ సూట్ అందిస్తున్న కరణంరెడ్డి

పెదగంట్యాడ: మండలంలోని న్యూ పెంటమాంబ జిమ్ ఆధ్వర్యంలో ఈ నెల 30న జిల్లా స్థాయి బాడీబిల్డింగ్ పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీలకు హాజరు కానున్న బాడీ బిల్డర్లకు బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు గురువారం ట్రాక్ సూట్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ బాడీ బిల్డర్లు ఈ పోటీల్లో పాల్గొని విజయం సాధించాలని ఆకాంక్షించారు. విజేతలకు మిస్టర్ విశాఖ టైటిల్‌తో పాటు ఇరవై వేల రూపాయలు నగదు బహుమతి అందజేస్తామన్నారు. కార్యక్రమంలో రామిరెడ్డి, కిలాన ముసలయ్య, నాగిరెడ్డి, ప్రసాద్, రామోజీ తదితరులు పాల్గొన్నారు.

ఉద్దేశ పూర్వకంగానే 'ఉక్కు' ఉత్పత్తికి ఆటంకం

- విషం చిమ్ముతున్న గంగవరం పోర్టు ఎత్తుగడలను అడ్డుకుంటాం
- ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు
- 896వ రోజుకు రిలే నిరాహార దీక్షలు



దీక్ష శిబిరంలో కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న నాయకులు

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తికి గంగవరం పోర్టు యాజమాన్యం కావాలనే ఆటంకం కలిగిస్తోందని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు ఆరోపించారు. విశాఖ ఉక్కు పరిశ్రమకు కావాల్సిన కుకింగ్ కోల్ తరలింపునకు అడ్డు తగులుతూ విశాఖ ఉక్కుపై విషం చిమ్ముతున్న గంగవరం పోర్టు ఎత్తుగడలను కార్మికులందరం అడ్డుకుంటామని స్పష్టం చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి 896వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో సంస్థకు చెందిన ఎంఎంఎస్ఎం, ఎస్‌బీఎం విభాగ కార్మికులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి, ప్రైవేటీకరణకు సహకరిస్తున్న గంగవరం పోర్టు యాజమాన్యానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పోర్టు, స్టీల్‌ప్లాంట్ మధ్య హ్యాండ్లింగ్ చార్జీల లావాదేవీలు నిరంతరం జరుగుతుంటాయని, కానీ, ఇటీవల ఉద్దేశపూర్వకంగానే అదాని గంగవరం పోర్టు యాజమాన్యం స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తికి అవరోధాలు కల్పిస్తోందని ఆరోపించారు. పోర్టు యాజమాన్యం త్వరితగతిన సమస్యను పరిష్కరించకపోతే గంగవరం పోర్టుకు అనుసంధానమైన రోడ్డు, రైళ్లు, వేగన్లు, నీరు, విద్యుత్ వంటివాటిని స్తంభింపజేస్తామని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వానికి తోడుగా గంగవరం పోర్టు యాజమాన్యం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడాల్సిన ఆసన్నమైందన్నారు. కార్మికులంతా ఐక్యంగా ఉంటూ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

'ఎన్‌ఈపీ-2020'తో సత్ఫలితాలు

- 21వ శతాబ్ద అవసరాలకు అనుగుణంగా బోధన
- ఆటపాటలతో విద్యార్థుల అభ్యసనం
- ఎన్ఏడీ కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ ఆదిశేష శర్మ



ఎన్ఏడీ కేంద్రీయ విద్యాలయంలో బోధనకు వాడుతున్న బొమ్మలను పరిశీలిస్తున్న దృశ్యం



విలేకర్లతో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ఆదిశేషు శర్మ, పలు కేవీల ప్రిన్సిపాళ్లు

గోపాలపట్నం: జాతీయ విద్యావిధానం – 2020లో భాగంగా విద్యార్థులు ఆటపాటల ద్వారా అభ్యసిస్తున్నారని ఎన్ఏడీ కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ ఆదిశేషశర్మ అన్నారు. 21వ శతాబ్ద అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దేలా ఈ విధానం ఉందన్నారు. ఎన్ఏడీ కేంద్రీయ విద్యాలయంలో నూతన విద్యావిధానం అమలై మూడేళ్లు అయిన సందర్భంగా వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐదేళ్ల లోపు పిల్లలు మూడు విధాలుగా విద్యను అభ్యసిస్తున్నారన్నారు. వారు విద్యపై ఆసక్తి పెంచుకునేలా, సులువుగా అర్థం చేసుకునేలా ఆటపాటలతో ఉపాధ్యాయులు బోధిస్తున్నారన్నారు. పాఠశాలకు విద్యార్థులు సంతోషంగా వస్తున్నారని చెప్పారు. వారిలో శాస్త్రీయ స్వభావాన్ని ప్రోత్సహిస్తున్నామని తెలిపారు.

49 కేవీల్లో బాల్వాడీ విధానం

49 కేంద్రీయ విద్యాలయాల్లో బాల్వాడీ విధానం అమలు చేస్తున్నామని ఆయన తెలిపారు. 3ప్లస్, 4ప్లస్, 5ప్లస్ ఏళ్ల వయసు గల విద్యార్థులను మూడు విభాగాలుగా విభజించి, బోధిస్తున్నామన్నారు. 2022–23 విద్యాసంవత్సరంలో 5,477 మంది విద్యార్థులు మూడు తరగతుల్లో ప్రవేశం పొందారని తెలిపారు. విద్యాలయాల్లో పేరెంట్ టీచర్ అసోసియేషన్ ఉందని, ప్రతీ నెలా పేరెంట్ టీచర్ సమావేశాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. మెరుగైన విద్యనందించేందుకు ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలియజేశారు.

వన్ నేషన్.. వన్ డిజిటల్ ప్లాట్‌ఫాం

నేషనల్ కరికులం ఫ్రేమ్‌వర్క్ ఫర్ ఫౌండేషన్ స్టేజ్ (ఎన్‌సీఎఫ్ ఎఫ్ఎస్) 2022లో పాఠ్యాంశాల్లో 8వ తరగతి నుంచి అన్ని కేంద్రీయ విద్యాలయాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను వృత్తిపరమైన సబ్జెక్ట్‌గా ప్రవేశపెట్టారన్నారు. 228 కేవీల్లో స్కిల్ హబ్‌లు ప్రారంభమయ్యాయని తెలిపారు. పీఎం ఈ–విద్య ద్వారా విద్యార్థులకు డిజిటల్, ఆన్‌లైన్, ఆన్ ఎయిర్ ద్వారా విద్యను అందిస్తున్నారన్నారు. వన్ నేషన్.. వన్ డిజిటల్ ప్లాంట్‌ఫాంగా ఉందన్నారు. విద్యార్థులకు మెరుగైన అభ్యసనం కోసం కేవీల్లో డెస్క్‌టాప్‌లు, ల్యాప్‌టాప్‌లు, ట్యాబ్లెట్‌లతో స్మార్ట్ క్లాసరూములు ఏర్పాటు చేశామని చెప్పారు. విద్యార్థులకు ఏ విధంగా విద్యబోధన చేస్తున్నారో వివరించారు. పాఠశాల ప్రాంగణంలో విద్యాభ్యాసం కోసం తయారు చేసిన వివిధ రకాల బొమ్మలు, వస్తువులను ప్రదర్శనలో ఉంచారు. వాటిని పలు కేంద్రీయ విద్యాలయాల ప్రిన్సిపాల్స్ సందర్శించారు. కార్యక్రమంలో కేవీ–2 ప్రిన్సిపాల్ శ్రీనివాస్, కేవీ–1 ప్రిన్సిపాల్ సురేష్ కుమర్, స్టీల్‌ప్లాంట్ కేవీ ప్రిన్సిపాల్ శ్యామ్ కుమార్, మల్కాపురం కేవీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఆచార్య, హెచ్ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న హరిత నగరానికి స్థల పరిశీలన



జిందాల్ భవన్ వద్ద స్థలం పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీధర్

గోపాలపట్నం: జగనన్న హరిత నగరాలను గుర్తించి మొక్కలు నాటే నిమిత్తం జీవీఎంసీ 52వ వార్డులో డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ స్థల పరిశీలన చేశారు. ఇక్కడి జాతీయ రహదారి పక్కనే ఉన్న జిందాల్ భవన్ వద్ద గ్రీన్ బెల్టులో మొక్కలు నాటేందుకు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న హరిత నగరాలు కార్యక్రమం ద్వారా శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా మొక్కలు నాటనున్నట్లు తెలిపారు. అందులో భాగంగా జాతీయ రహదారి పక్కనే ఉన్న స్థలంలో మొక్కలు నాటుతున్నామన్నారు. వార్డులోనూ పలు చోట్ల మొక్కలు నాటనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో హార్టికల్చర్ ఏఈ అర్చన, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బీఎస్ కృష్ణ, వైఎస్సార్‌సీపీ నగర కార్యదర్శి వెదుళ్ల శ్రీనివాసరావు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆంధ్ర టెక్ లీగ్ పోస్టర్ విడుదల

ఏయూ క్యాంపస్: సాంకేతిక రంగంలో యువతను ప్రోత్సహించేలా ఆంధ్ర టెక్ లీగ్ నిర్వహిస్తున్నట్టు టెక్ టీం సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు గురువారం ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి..ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఫైనల్ పోటీలు ఏయూ ఆ హబ్ వేదికగా అక్టోబర్ 1న నిర్వహించనున్నారు.

నేవీ చిల్డ్రన్ స్కూల్‌లో మిల్లెట్స్ వారోత్సవాలు



మిల్లెట్స్ ప్రాధాన్యాన్ని వివరిస్తున్న విద్యార్థులు

సింధియా: నేవీ చిల్డ్రన్స్ స్కూల్‌లో మిల్లెట్స్ వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ నెల 19 ప్రారంభమైన ఉత్సవాలు 26వ తేదీ వరకు జరిగాయి. వారోత్సవాల్లో భాగంగా చిరుధాన్యాలను ప్రదర్శించడంతో పాటు ఆరోగ్యకర జీవనశైలిలో వాటి ప్రాధాన్యాన్ని విద్యార్థులు వివరించారు. స్లోగన్ రైటింగ్, పోస్టర్ మేకింగ్, క్విజ్, ఇంటర్‌స్కూల్ పేపర్ ప్రెజెంటేషన్, ప్యానెల్ డిస్కషన్ తదితర కార్యక్రమాలను నిర్వహించారు. విద్యార్థులకు రుచికరమైన వంటకాలను పరిచయం చేసేందుకు మినుములతో రుచికరమైన వంటల పోటీని కూడా నిర్వహించారు. కార్యక్రమానికి బ్రిగేడియర్ ఎస్.రామనాథన్, వీఎస్ఎం, డీడీజీ అండ్ సీఈ, డీజీఎన్‌పీ ముఖ్య అతిథులుగా హాజరై వివిధ పోటీల్లో విజేతలకు సర్టిఫికెట్లు, ట్రోఫీలను అందజేశారు. అనంతరం జొన్నల వంటకాల సంకలన పుస్తకాన్ని ఆవిష్కరించారు.